క్లుప్తంగా

యువత సన్మార్గంలో నడవాలి



సదస్సులో మాట్లాడుతున్న సినీ ఆర్టిస్ట్ ప్రదీప్

మలికిపురం: యువత వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ప్రదీప్ అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు, విద్యార్థులకు కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తలకు కావలసిన పలు సూచనలు ఆయన చేశారు. నేటి యువత చెడు అలవాట్లకు వ్యసనాలకు బానిస కాకుండా వాటిని ఏ విధంగా దూరం చేసుకోవాలనే అంశాలపై ప్రసంగించారు. సంస్థ చైర్మన్ ఈద సామ్యూల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆ సంస్థ సభ్యులు, కాలేజీ కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి, జీఎన్నార్ సంస్థ అధ్యక్షుడు గెద్దాడ నాగేశ్వరరావు, మలికిపురం సర్పంచ్ గడ్డం రాజ్యలక్ష్మి, కాలేజీ ప్రిన్సిపాల్ నల్లి ఆనందమహాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



ఆత్రేయపురంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, భక్త దంపతులు

కొత్తపేట: మండల కేంద్రం ఆత్రేయపురంలో వేంచేసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాతలు పాతపాటి రామాంజనేయరాజు, పాతపాటి వెంకటసత్యనారాయణరాజు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న నిత్య, వార్షిక కార్యక్రమాల్లో భాగంగా చైత్రమాసం శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి పవన్‌దీక్షితుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భక్త దంపతులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. పలువురు పట్టు వస్త్రాలు, కల్యాణ సామగ్రి, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆత్రేయపురం, పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వహకుడు గోరింట విజయ్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు చేశారు.

బైపాస్ పనులు ప్రారంభిస్తాం



దిండిలో కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

మలికిపురం: వశిష్ట నదిపై వంతెనతో పాటు 216 జాతీయ రహదారి బైపాస్ పనులు కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర భారీ పరిశ్రమల, బొగ్గు గనుల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన వర్మకు దిండిలో జిల్లా బీజేపీ శ్రేణులు మంత్రికి శాలువ కప్పి, ఘన స్వాగతం పలికారు. హైవే పనులకు అడ్డంకులు తొలగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని మంత్రిని కోరారు. ఆయన స్పందిస్తూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇటీవల తనతో ప్రత్యేకంగా భేటీ అయి బైపాస్ రోడ్డు, వంతెన తీరుపై చర్చించారని అన్నారు. రూ.600 కోట్లు మంజూరై ఉన్న ఈ వంతెన, రోడ్డు పనులకు అడ్డంకులను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలాగే రైల్వే లైన్ పనులు కూడా వేగవంతం చేయిస్తామన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ఏడిద వంశి కుంచే పెద్దబ్బులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

28 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మె



పి.గన్నవరంలో ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పి.గన్నవరం: ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, 19 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28 నుంచి సమ్మె చేస్తున్నట్టు మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు పి.గన్నవరంలో ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్‌కు సోమవారం మండల సంఘ అధ్యక్షుడు ఆకుల నాగప్రసాద్, ఉపాధ్యక్షుడు చింతపర్తి సీమయ్య, కార్యదర్శి పి.పల్లపురాజు తదితరులు వినతి పత్రం అందజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓను కలసిన వారిలో సంఘ నాయకులు వాసంశెట్టి శ్రీనివాసరావు, జి.వెంగళరావు, కడలి రామచంద్రరావు, బూల సత్యనారాయణ, జానకి రామయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చితే గాలి కలుషితం
- ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం
- డంపింగ్ యార్డుల్లో పెద్ద ఎత్తున కాల్చివేత
- వాతావరణంలోకి కాలుష్య కారకాలు



రావులపాడు కాలువగట్టు రోడ్డులో డంపింగ్‌యార్డులో తగులబెడుతున్న చెత్త

రావులపాలెం: ప్లాస్టిక్ వినియోగంతో ప్రజా జీవితాలకు పెనుముప్పు కలుగుతుందని ఒక పక్క నిపుణులు మొత్తుకుంటున్నారు. వాడకంతోనే తీవ్ర అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు. అయితే నేరుగా ప్లాస్టిక్‌ను తగలబెడుతూ ప్రజల ఆరోగ్యంతో యంత్రాంగం చెలగాటం ఆడుతోందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. జనావాసాల నుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు, మద్యం షాపులు, కిళ్లీ బడ్డీలు, జ్యూస్ స్టాళ్లు, కర్రీ పాయింట్ల నుంచి ప్రతి నిత్యం టన్నుల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. అక్కడ వాటిని నిప్పు అంటించి కనిపించకుండా చేస్తున్నారు. తద్వారా వాతావరణంలో అత్యంత విషపూరిత కలుషితాలను నేరుగానే కలుపుతున్నారు. రావులపాలెం మండలంలో 12 గ్రామాల్లో ఎక్కడా అధికారిక డంపింగ్ యార్డులు లేకపోవడంతో గోదావరి గట్లు, కాలువ గట్లు, ప్రధాన రహదారుల చెంతన డంపింగ్ యార్డులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం చెత్తను తగులబెడుతున్నారు.

గాలి కలుషితం

దాదాపు ప్రతి డంపింగ్ యార్డులోనూ నిత్యం ప్లాస్టిక్ చెత్త తగలబడుతూనే ఉంటోంది. ఇది మనం పీల్చేగాలిని తీవ్ర స్థాయిలోనే కలుషితం చేస్తోందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 50 కంటే తక్కువగా ఉంటేనే ఆ గాలిని పీల్చుకోవడం ఆరోగ్యకరమని అనేక నివేదికలు చెబుతున్నాయి. అయితే డంపింగ్ యార్డుల్లో నిత్యం ప్లాస్టిక్‌ను తగులబెట్టే ప్రాంతాల్లోనూ ఈ ఏక్యూఐ 70 నుంచి 119 వరకు ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా ప్రతి మొబైల్‌లోనూ ఈ ఏక్యూఐని చూపించే యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పరీక్షిస్తే గాలి నాణ్యత ఆందోళనకరంగానే ఉంటోందంటున్నారు. మరింత శాస్త్రీయ పరికరాల ద్వారా ఈ పరీక్షలు చేస్తే ఇంత కంటే ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని పంట పొలాలు ఉండే చోట్ల కూడా గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉంటోందంటే దీనికి ప్రధాన కారణంగా చెత్తను తగులబెట్టడమేనని చెబుతున్నారు.

ప్రచారానికే పరిమితం

తడి చెత్త, పొడి చెత్త అంటూ ప్రచారానికి మాత్రమే పరిమితమవుతున్న యంత్రాంగం ఆ తరువాత వీటిని గురించి పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త ద్వారా ఎరువులను ఉత్పత్తి చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న అధికారులు, పొడి చెత్తను ఏం చేస్తున్నారన్నదానికి మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఈ పొడి చెత్తలో అత్యధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలేనని, వీటిని తగలబెట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, ఆయా వస్తువుల వినియోగం మాత్రం ఎక్కడా తగ్గిన దాఖలాల్లేవు. అలా వినియోగించిన వస్తువులు మొత్తం డంపింగ్ యార్డులు, పంట కాలువల్లోకే చేరుతున్నాయి. ఆ తరువాత కాల్చివేస్తున్నారు. ఇది అంతిమంగా ప్రజల ఆరోగ్యంపైనే తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ఘాటైన వాసనతో ఇబ్బందులు



ప్రతి రోజూ డంపింగ్ యార్డుల నుంచి వెలువడే పొగతో ఘాటైన వాసన వస్తోంది. దీంతో ఊపిరి తీసుకోవడం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. వాహనాలపై వెళ్లే సమయంలో ఊపిరి బిగబట్టి ప్రయాణిస్తున్నాం. పొగ వెళ్లినంత దూరం దగ్గరలో ఉన్న పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో ప్రజలకు ఈ ఇబ్బంది తప్పడం లేదు.

– పలివెల రవీంద్రనాథ్, రావులపాలెం

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి



ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టాలి. దానికి ప్రత్యామ్నాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. తాము తెచ్చిన ప్లాస్టిక్ వస్తువులను చెత్తతో పాటు పడేస్తే, అది తిరిగి తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందన్న రీతిలో చైతన్య పరచాలి. డంపింగ్ యార్డుల్లో చెత్తను తగులబెట్టడం వల్ల ప్రజారోగ్యాన్ని తీవ్ర ముప్పు కలుగుతుంది.

– మల్లిడి ప్రభాకరరెడ్డి, రావులపాలెం

పశువైద్య వాహన సేవల పునరుద్ధరణకు చర్యలు

కొత్తపేట: సంచార పశువైద్య వాహనం సేవలు తిరిగి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ వెంకటనారాయణ తెలిపారు. గత కొంత కాలంగా నిలిచిపోయిన సంచార పశువైద్య వాహన సేవలపై సోమవారం సాక్షిలో 'పశువైద్యానికి సుస్తీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి వెటర్నరీ ఏడీ వెంకటనారాయణ స్పందించారు. ఆ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

సాక్షి ఇంపాక్ట్

గత ప్రభుత్వ హయాంలో పాడి రైతులకు సంబంధించిన మూగ జీవాలకు ఇంటి వద్దనే పశు వైద్య సేవలు అందించేందుకు మొదటి విడత '1962' సంచార పశువైద్య వాహనాలను 5 సంవత్సరాల కాలపరిమితిలో 'జీవీకే' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. ఆ ఒప్పంద కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో ఆ వాహన సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సేవలు కొనసాగించేందుకు టెండర్లు పిలిచామని, టెండర్లు ఖరారైన తర్వాత తిరిగి సంచార పశువైద్య వాహనం ద్వారా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

లీజు ఇవ్వడం లేదంటూ ఆర్డీఓకు రైతుల ఫిర్యాదు



లీజు సమస్యపై ఆర్డీఓ మాధవికి ఫిర్యాదు చేస్తున్న కరవాక రైతులు

మామిడికుదురు: సముద్ర తీరంలోని కరవాకలో తమ వద్ద తీసుకున్న భూములకు ఓఎన్జీసీ లీజు ఇవ్వడం లేదంటూ రైతులు సోమవారం అమలాపురంలో ఆర్డీఓ మాధవికి ఫిర్యాదు చేశారు. 2022–23 నుంచి లీజు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. రేకడి శ్రీనివాసరావుతో పాటు పలువురు రైతులు ఆర్డీఓను కలసి తమ సమస్యను విన్నవించారు. 13 మంది రైతుల నుంచి 6.50 ఎకరాల భూమిని ఓఎన్జీసీ 2009–10వ సంవత్సరంలో లీజుకు తీసుకుందన్నారు. 2202–2021 నుంచి లీజులు చెల్లించేందుకు ఇబ్బంది పెట్టారన్నారు. 2022లో దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఓఎన్జీసీ వాహనాలను ఏడు రోజులు నిలిపి వేసి ధర్నా చేశామన్నారు. దీంతో దిగి వచ్చిన ఓఎన్జీసీ అధికారులు అప్పటి వరకు ఉన్న లీజు బకాయిలు చెల్లించారని చెప్పారు. మళ్లీ 2022–23 నుంచి లీజు ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై స్పందించి తమకు రావాల్సిన లీజు బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఓఎన్జీసీ వాహనాలను మళ్లీ నిలిపి వేసి ఆందోళన చేపడతామని అల్టిమేటం జారీ చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ శాంతకుమారి

రాజోలు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ జోగి శాంతకుమారి ఆధ్వర్యంలో సత్కరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిర్రా సత్యనారాయణ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. కళాశాల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలవడం గర్వకారణమని ప్రిన్సిపాల్ శాంతకుమారి అన్నారు. వి.తేజస్వినీ సత్య (బైపీసీ) 934, ఎండీ హెచ్‌హెచ్ కానూర్ (ఎంపీసీ) 918, కె.వినయ్ (సీఈసీ) 853, యు.లోకేష్ (హెచ్ఈసీ) 584 మార్కులు సాధించగా, ఇంటర్ మొదటి ఫస్టియర్ ఫలితాల్లో ఆర్ జ్ఞానేశ్వరి 448, ఎస్‌జే ఇవాంజిలిన్ 409, యం.సాయిశ్రీ 413 మార్కులు సాధించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు.

విద్య నేర్పిన వారికి ఎల్లవేళలా గుర్తింపు



తొండవరంలో రాంబాబు దంపతులను సన్మానిస్తున్న డీఈఓ సలీంబాషా

అంబాజీపేట: ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు క్రమశిక్షణతో పాటు విద్యను నేర్పిన వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మట్టపర్తి రాంబాబు ఉద్యోగ విరమణ సన్మాన సభ హెచ్ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసేవారిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం రాంబాబు, వెంకటరమణమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికే బడిబాట

కొత్తపేట: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కొత్తపేట మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక శ్రీనివాసపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేయడానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేటట్లు చేయడం, విద్యారంగం బలోపేతం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, పలువురు బాలలను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉప సర్పంచ్ విళ్ల మారుతీ ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా, మండల శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్ పరిశీలన



సఖినేటిపల్లిలంకలో శిథిలస్థితికి చేరి అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శిథిల స్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను సోమవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. శిథిల స్థితికి చేరిన స్లూయిజ్ వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గోదావరి పోటు, పాట్ల సమయంలో ఉప్పునీరు పంట పొలాల్లోకి పోటెత్తి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తెలిపారు. తక్షణం దెబ్బతిన్న తలుపులు స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులతో దీనిపై చర్చించిన ఎమ్మెల్యే, ఎన్ఆర్‌జీఎస్ గ్రాంటు నుంచి ప్రత్యేక అనుమతితో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, రేవూరి యేసు నరసింహారాజా, కూటమి నాయకులు, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, డ్రెయిన్స్ అధికారులు పాల్గొన్నారు.

కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి

అంబాజీపేట: విద్యార్థులు భవిష్యత్‌లో ఉపయోగపడే కోర్సులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి వాటినే ఎంచుకుని శ్రద్ధగా చదువుకుంటే బంగారు బాట అవుతుందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఒకేషనల్ కోర్సులో భాగంగా 12 రోజుల పాటు నిర్వహించిన ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన ట్రెనింగ్ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ బి.లక్ష్మణమూర్తి, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎంఏకే భీమారావు, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఒకేషనల్ టీచర్స్ జి.తేజస్విని, వై.స్టీఫెన్, వై.వివేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా పాళ్లమ్మ పానుపు సేవ

మామిడికుదురు: ఈదరాడ గ్రామదేవత పాళ్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం పానుపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆరు గరగలతో ఇంటింటికీ వెళ్లి పానుపు సేవను కోలాహలంగా జరిపించారు. రెండేసి గరగలను ఇంటింటికీ తీసుకు వెళ్లారు. ఆ గరగలకు భక్తులు సాదరంగా స్వాగతం పలికారు. ఆసాదుల కాళ్లు కడిగి అమ్మవారిని ఇంట్లోకి ఆహ్వానించారు. అక్కడ సంప్రదాయబద్ధంగా పానుపు వేశారు. మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది. పలువురు భక్తులు పాళ్లమ్మను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సాదనాల సుబ్బారావు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారి జాతర మహోత్సవాలను వైభవంగా జరిపించారు.

వచ్చే నెల 10, 11 తేదీల్లో సాహితీ సంబరాలు

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల 10, 11 తేదీల్లో ఏలూరు పట్టణంలో మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు ఏర్పాటు చేసినట్టు వేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. సోమవారం సఖినేటిపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు రోజుల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో కవితోత్సవం, సాహితీ సదస్సులు, వివిధ రంగాల కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు తదితర సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదికపై తెచ్చేందుకు ప్రతిష్టాత్మకంగా సంబరాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వక్ఫ్ చట్టంపై ర్యాలీ

రావులపాలెం: ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ చట్టం ముస్లింల వక్ఫ్ భూములను కబళించే విధంగా ఉన్నాయని చట్ట సవరణకు వెంటనే ఉపసంహరించాలని, ఈ నిరసనలు దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఐక్య వేదిక కన్వీనర్ షేక్ అన్సారీ, మేలుకో ఆంధ్ర సభ్యులు థామస్ పల్లె తానం, కమ్యూనిస్టు నేతలు తెలిపారు. అనంతరం రావులపాలెం తహసీల్దారు ముక్తేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అధిక సంఖ్యలో ముస్లిం మహిళలు, మసీద్ సభ్యులు పాల్గొన్నారు.

26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సఖినేటిపల్లి: మండలంలోని గొంది గ్రామంలో స్థానిక శాంతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగనుంది. వివరాలను యూత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణను, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీ మోకా సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు పాల్గొంటున్నట్టు శాంతి యూత్ పేర్కొంది.

ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు



మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అయినవిల్లి: నేదునూరు, అయినవిల్లి గ్రామాల పరిసరాల్లో ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ వద్ద ఆందోళన చేశారు. చాలా కాలంగా తాము వరి పంట సాగు చేసుకుంటూ రెండు పూటలా భోజనం చేస్తున్నామని అన్నారు.కొంత మంది రాజకీయ నాయకులు కుట్ర పూరితంగా రొయ్యల చెరువులుగా బంగారంలా పండే పంట భూములు మార్చేందుకు యత్నిస్తున్నారన్నారు. పంట చేలను రొయ్యల చెరువులుగా మారిస్తే తాము రోడ్డున పడతామన్నారు. అలాగే తమ చేలకు ఆనుకుని ఎండోమెంట్ భూములు ఉన్నాయన్నారు. మరి ప్రభుత్వాధికారులు ఆక్వా జోన్‌గా ఎలా మారుస్తారని వారు ప్రశ్నించారు. అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి వై.శోభకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు వేగేశ్న వెంకన్నబాబురాజు, మిండగుదిటి శ్రీరామ్, ఈలి సత్తిబాబు, బావిశెట్టి ఆదినారాయణ పడమట రామ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఆకుకూరలతో మెరుగైన ఆరోగ్యం



వేగివారిపాలెంలో ఆకు కూరలు విక్రయిస్తున్న మహిళా రైతులు

రాజోలు: సేంద్రియ ఆకుకూరలతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ తాటిపాక యూనిట్ ఇన్‌చార్జ్ పోతురాజు ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం వేగివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన ఆకుకూరల సాగు పొలాలను సందర్శించారు. ఎలాంటి రసాయన ఎరువులు వినియోగించకుండా పండించిన ఆకుకూరలను విక్రయించారు. పొదలాడ ఆదర్శ రైతులు మామిడిశెట్టి సుబ్రహ్మణ్యం, కడలి రాజులు వ్యవసాయంలో పాటించిన విషయాలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయమే కీలకం

భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయమే కీలకంగా మారుతుందని పాలగుమ్మి సర్పంచ్ అప్పారి లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ వద్ద ప్రకృతి వ్యవసాయ గ్రామసభ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు తెలుసుకుని రైతులందరూ తప్పక ఆచరించాలని, దీనివల్ల భూమి సారవంతం పెరిగి దిగుబడి ఎక్కువ వస్తుందని అన్నారు.

జగ్గిరెడ్డికి అభినందనలు



గోపాలపురంలో జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న సర్పంచ్ బంగార్రాజు తదితరులు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మండలంలోని గంటి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రావులపాలెం మండలం గోపాలపురంలో జగ్గిరెడ్డి స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు ఇచ్చి దుశ్శాలువతో సత్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, మాజీ సర్పంచ్ మట్టపర్తి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు భూపతిరాజు సత్యనారాయణరాజు, పోలుమాటి అంజనీకుమారి తదితరులు జగ్గిరెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

గోపాలపురం కార్యదర్శి సాయిరామ్ మృతి



నిమ్మకాయల సాయిరామ్ (ఫైల్)

రావులపాలెం/ఆలమూరు: మండలంలోని గోపాలపురం కార్యదర్శిగా పనిచేస్తున్న నిమ్మకాయల సాయిరామ్ (54) సోమ వారం అనారోగ్య కారణాలతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. సోమవారం ఉదయం ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సాయిరామ్ మండలంలోని రావులపాడు, వెదిరేశ్వరం, గోపాలపురం, తదితర గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా సేవలందించారు. సాయిరామ్ మృతికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సాయిరామ్‌కు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. సాయిరామ్ మృతితో ఆయన స్వగ్రామం ఆలమూరులో విషాదం అలుముకుంది.

ఆరోపణలపై డీవైఈఓ విచారణ

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పీఎంశ్రీ నిధులతో చేపట్టిన పనులు, మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుతో కొత్తపేట డీవైఈఓ బి.రామలక్ష్మణమూర్తి సోమవారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఎం కడలి సాయిరామ్ పీఎంశ్రీ నిధులు దుర్వినియోగం చేశారని, కోడిగుడ్లు అవకతవకలు జరిగాయని స్థానిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. పీఎంశ్రీ నిధుల ద్వారా రూ.18.70 లక్షల నిధులు మంజూరయ్యాయని వీటితో కెమిస్ట్రీ ల్యాబ్, గ్రౌండ్ అభివృద్ధి పనులు, రెయిలింగ్ తదితర పనులను చేశారన్నారు. ఫిర్యాదీ చేసిన ఆరోపణలపై పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించామన్నారు. ఈ నివేదికను డీఈఓకు అందిస్తామన్నారు. దీనిపై హెచ్ఎంను వివరణ కోరగా పీఎంశ్రీ నిధులకు సంబంధించి అన్ని బిల్లులు సక్రమంగా ఉన్నాయని, దానిపై ఆడిట్ జరిగిందన్నారు.

ఉపాధ్యాయునికి ఘన వీడ్కోలు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు) ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న గౌరీకృష్ణ వీడ్కోలు సన్మాన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభకు హెచ్ఎం వై.చంద్రశేఖరం అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, గ్రామ పెద్ద చీకట్ల రామారావు, కె.లీలావతి, సర్పంచ్ త్సామా బాబు, విద్యాకమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.